క్లుప్తంగా

రేపు కోర్టు ప్రాంగణంలో హరితహారం

జడ్చర్ల టౌన్: రాష్ట్ర న్యాయసేవాధికారసంస్థ ఉత్తర్వుల మేరకు బుధవారం ఉదయం జడ్చర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో హరితహారం చేపట్టనున్నారు. స్థానిక న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ టి. లక్ష్మి ఆధ్వర్యంలో మొక్కలు నాటనున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సంస్థ సభ్యులు సూచించారు.

భౌతికశాస్త్ర ఉపాధ్యాయులపై చిన్నచూపు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: భౌతికశాస్త్ర స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు 6, 7 తరగతులకు గణితం బోధించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం తమను చిన్నచూపు చూడడమే అవుతుందని ఆ ఫోరం ఉపాధ్యాయ నాయకులు అన్నారు. ఈమేరకు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ డీఈఓ రవీందర్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఇదీ ఏవిధంగా ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు.

హెచ్‌ఎంలను బాధ్యులను చేయరాదు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనుల విషయంలో హెచ్‌ఎంలను బాధ్యులను చేయడం సరికాదని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నారాయణగౌడ్, రఘురాం రెడ్డిలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేసవి సెలవుల్లోనూ పాఠశాలల్లో జరుగుతున్న పనులకు సహకరిస్తున్న వారిని ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు.

ఘనంగా బోనాలు

బాలానగర్: మండలపరిధిలోని మోతీఘణాపూర్‌లో బొడ్రాయి పండుగను చేసి 7 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా బొడ్రాయి బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బొడ్రాయికి బోనాలతో నైవేద్యాన్ని సమర్పించారు. గ్రామాన్ని చల్లాగా చూడాలని మొక్కుకున్నారు.

ముగిసిన సామూహిక పూజలు

జడ్చర్ల టౌన్: మండలంలోని గొల్లపల్లి వద్ద 44వ నంబరు జాతీయరహదారిపై ఉన్న లలితాంబికా ఆలయంలో ఐదురోజులుగా నిర్వహిస్తున్న ఉచిత సరస్వతి దేవి సామూహిక పూజలు సోమవారంతో ముగిశాయి. లలితాంబికా తపోవన అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రతిరోజు ఆలయ ప్రాంగణంలో సామూహిక సరస్వతి దేవి పూజలు, అన్నదానం చేపట్టారు. పాఠశాలలు పున:ప్రారంభం అవుతున్నందున నిర్వహించిన సామూహిక పూజల్లో పెద్ద సంఖ్యలో చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎవర్టోజెన్ శ్రమదానం

పోలేపల్లి ఫార్మసెజ్‌లోని ఎవర్టోజెన్ లైఫ్ సైన్సెస్ సంస్థ సోమవారం లలితాంబికా తపోవనంలో శ్రమదానం నిర్వహించారు. తపోవనం లోని గోశాల, ఆలయ ప్రాంగణంలో చెత్తా చెదారం తొలగించి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేశారు. సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా వీటిని చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలియజేశారు.

రెండోరోజు 485 జతల యూనిఫామ్స్ అందజేత

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహిళా సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం కుట్టిన 485 జతల కొత్త యూనిఫామ్స్ రెండోరోజు సోమవారం ఎంఈఓ జయశ్రీకి మెప్మా అధికారులు అందజేశారు. ఇందులో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (కోనాపాలమూరు), ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (మహబూబ్‌నగర్), ప్రాథమిక పాఠశాల (శివశక్తినగర్), ప్రాథమిక పాఠశాల (హనుమాన్‌నగర్) లో చదివే 75 మంది బాలురకు, 410 మంది బాలికలకు పంపిణీ చేయనున్నారు. కాగా, ఈనెల 1న 197 జతల యూనిఫామ్స్ అందజేసిన విషయం విదితమే. ఇప్పటివరకు మొత్తం 682 జతలను ఇచ్చారు. డీఎంసీ శివకుమార్‌గౌడ్, సీఓ యాదయ్య పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని వినతి

నారాయణపేట: పెండింగ్‌లో ఉన్న డెలివరీ, డెత్, మ్యారేజ్ గిఫ్ట్ కోసం దరఖాస్తు చేసుకున్న భవన నిర్మాణం కార్మికులకు డబ్బులు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఏఓ నర్సింగ్‌రావుకు తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు నరసింహ మాట్లాడుతూ కార్మికులకు సంక్షేమ పథకం ద్వారా వచ్చే డబ్బుల కోసం దరఖాస్తు చేసుకుని మూడు, నాలుగు సంవత్సరాలు గడుస్తున్న అధికారులు డబ్బులు మంజూరు చేయకుండా లేబర్ ఆఫీస్ చుట్టూ తిప్పుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దరఖాస్తు చేసుకున్నప్పుడు విచారణ చేసి ఏఎల్ఓ దరఖాస్తు తీసుకుని, అప్లికేషన్ పైకి పంపుతామని చెప్పి సంవత్సరం గడిచిన తర్వాత డీసీఎల్ మళ్లీ విచారణ చేయడం సరైంది కాదన్నారు. డబ్బులు వెంటనే మంజూరు చేయాలని లేనిచో ఉద్యమాలు చేస్తామన్నారు.

పేరొకచోట.. ఉన్నదోచోట



- ఇప్పటికీ జడ్చర్లలో కొనసాగుతున్న నవాబుపేట గురుకులం
- ప్రభుత్వం ఆదేశాలు వచ్చినా మార్చనివైనం

నవాబుపేట: మండలానికి చెందిన గురుకుల పాఠశాల ఇప్పటికీ జడ్చర్లలో కొనసాగుతోంది. గత ప్రభుత్వం వచ్చే విద్యాసంవత్సరం వరకు ఎక్కడ ఉండాల్సిన వాటిని అక్కడే ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసి ఏడాది గడిచినా ఎలాంటి చర్యలు చేపట్టక పోవడం గమనార్హం. కొత్త ప్రభుత్వం హయాంలోనైనా మండల కేంద్రానికి మార్చుతారా? అంటే అనుమానమేనన్న పరిస్థితి కనిపిస్తోంది. కాగా జడ్చర్లలో కొనసాగుతున్న నవాబుపేట గురుకుల పాఠశాల తాజాగా విద్యా సంవత్సరం పూర్తి చేసుకుంటున్న తరుణంలో వెలుగు



జడ్చర్లలో కొనసాగుతున్న నవాబుపేట గురుకుల పాఠశాల సూచికబోర్డు

లోకి వచ్చింది. మూడు సంవత్సరాల క్రితం నవాబుపేటకు గురుకుల మంజూరైంది. కాగా దాన్ని ఏర్పాటు చేయటంలో ఇక్కడ అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ వస్తున్నారు. వసతి సౌకర్యం లేదన్న సాకు చూపడంతో.. దాన్ని జడ్చర్ల నియోజకవర్గం కేంద్రంలోనే ఏర్పాటు చేశారు. కాగా అప్పటి నుంచి అక్కడే కొనసాగుతూ వస్తోంది. ఇదిలా ఉంటే సదరు గురుకుల పాఠశాలలో చదివిన పదో తరగతి విద్యార్థులు మాత్రం ఏటా దాదాపుగా 35 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసి మండల కేంద్రంలోనే పరీక్షలు రాయాల్సి వస్తోంది. ఇలా కేవలం విద్యార్థుల పరీక్షల విషయంమే కాకుండా ఇతర విషయాల్లోనూ చాలా సాంకేతిక ఇబ్బందులు వచ్చి పడ్డాయి. గత ఏడాది జరిగిన టెట్ పరీక్షల్లో సైతం నవాబుపేట గురుకుల పాఠశాల సెంటర్‌గా ఉండగా అడ్రస్ విషయంలో చాలామంది అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. అలాగే పాఠశాలలో చేరేందుకు వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సైతం తీవ్ర ఇబ్బందులు పడి అడ్రస్ తెలుసుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. అలాగే పాఠశాలలో ఉండే బోధనేతర సిబ్బంది తదితర విషయాల్లో సైతం మండలానికి నష్టం జరుగుతోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి సందర్భంలో గురుకుల పాఠశాల మండలంలో కాకుండా ఇతర ప్రాంతంలో ఉండటంతో ఇబ్బందులు వస్తున్నాయని చెబుతున్నారు. ఇకనైనా మండల కేంద్రంలో ఏర్పాటు చేసే దిశగా ఆలోచించాలని కోరుతున్నారు. కాగా తాజా ప్రభుత్వం సైతం అద్దె భవనాల్లో ఇతర ప్రాంతాల్లో ఉన్న గురుకులాలను వెంటనే మంజూరైన ప్రాంతంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేయాలని కోరుతున్నారు. ఏటా ఏదో ఒకసాకుతో దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్న అధికారులు ఇకనైనా నిర్లక్ష్యం వీడాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.

బీటీరోడ్డు లేక అవస్థలు

అడ్డాకుల: మండలంలోని పెద్దమునుగల్‌ఛేడ్ నుంచి కొకుంట్ల మండలం ఇస్తంపల్లి గ్రామాల మధ్యన ఉన్న మట్టి రోడ్డు పూర్తి అధ్వానంగా మారింది. రెండు గ్రామాల మధ్యన ఉన్న పెద్దవాగులో రాకపోకలకు సరైన దారి లేదు. ద్విచక్రవాహనాలను ఇసుకలో తోసుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఆటోలు, ఇతర వాహనాలు ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి అనువుగా లేదు. వర్షాకాలంలో రోడ్డంతా బురదగా మారుతుండటంతో కనీసం నడిచి వెళ్లడానికి వీలు లేకుండా మారుతోంది. రెండు మండలాల మధ్యన ఉన్న రోడ్డు కావడంతో గత పాలకులు దీనిపై పెద్దగా దృష్టి సారించిన దాఖలాలు లేవు. ఈ రోడ్డును బాగు చేస్తే కొకుంట్లలో ఉన్న రైల్వే స్టేషన్‌కు వెళ్లడానికి అడ్డాకుల పరిసర గ్రామాల ప్రజలకు అనువైన దారి అవుతుంది. అధికారులు చొరవ తీసుకుని వాగులో బ్రిడ్జితో పాటు బీటీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



పెద్దమునుగల్‌ఛేడ్, ఇస్తంపల్లి గ్రామాల మధ్యన ఉన్న మట్టిరోడ్డు

క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి



విద్యార్థులతో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లా కేంద్రంలో కింగ్‌షోటోకాన్ కరాటే దూ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన 26వ వేసవి ఉచిత కరాటే శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కరాటేతో శారీరక దారుఢ్యంతోపాటు మానసికంగా ఎదగవచ్చని అన్నారు. శిక్షణ తీసుకున్న విద్యార్థులకు చైర్మన్లు సర్టిఫికెట్లు అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు హాదీ, కింగ్‌షోటోకాన్ ఫౌండర్ జహంగీర్‌పాషా ఖాద్రీ, చైర్మన్ లక్ష్మణ్, వైస్ చైర్మన్ చెన్న వీరయ్య, కోశాధికారి తిరుపతయ్య, కౌన్సిలర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఫలితాల కోసం ఎదురుచూపులు

నవాబుపేట: ఎంపీ ఎన్నికల కౌంటింగ్ మంగళవారం జరగనుండడంతో మండల ప్రజలు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ఐదు సంవత్సరాల క్రితం మండల వాసి అయిన మన్నెశ్రీనివాస్‌రెడ్డి ఎన్నికల్లో ఎంపీగా గెలుపొందగా.. తాజాగా సైతం బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలవడంతో ఆసక్తి నెలకొంది. గత ఎన్నికల్లో రెండోస్థానంలో బీజేపీ నిలవగా ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ మూడో స్థానానికి పరిమితమైంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో మండలంలో బీఆర్ఎస్ ఆధిపత్యం ప్రదర్శించింది. దాదాపు కాంగ్రెస్‌తో పోల్చినపుడు 11 వేల మెజార్టీ సాధించింది. అప్పట్లో బీఆర్ఎస్‌కు 14 వేలపై చీలుకు ఓట్లు రాగా, బీజేపీకి 9 వేలపై చీలుకు ఓట్లు వచ్చాయి. ఇక కాంగ్రెస్‌కు 3 వేలపై చిలుకు వచ్చాయి. ఈ క్రమంలో హోరాహోరిగా సాగిన ఈసారి ఎన్నికల్లో మండల పరిధిలో ఎవరికి ఆధిక్యం వస్తుందనే దానిపై ఉత్కంఠ నెలకొంది. బీఆర్ఎస్ గతంలో మాదిరిగా ఆధిపత్యం కొనసాగిస్తుందా? లేక రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ మెజార్టీ సాధిస్తుందా? బీజేపీ ముందంజ వేస్తుందా? అంటూ నాయకులు చర్చించుకుంటున్నారు.

ఈసారి ఒకరి కోసమే..

మండలంలోని ప్రజలు ఎన్నికలు జరిగిన ప్రతిసారీ ఇద్దరు ఎంపీల గెలుపు గురించి ఎదురు చూడాల్సి వచ్చేది. ఎందుకంటే మండలం రెండు పార్లమెంట్ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చేది. ఒక పక్క పాలమూర్ ఎంపీ స్థానానికి పోటీచేసే అభ్యర్థులకు కొన్ని గ్రామాలు, చేవేళ్ల ఎంపీ స్థానానికి పోటీ చేసే అభ్యర్థులకు మండలంలోని 12 గ్రామాల ప్రజలు ఓట్లు వేసేవారు. దీంతో రెండు స్థానాల ఫలితాల కోసం ఎదురు చూడాల్సి వచ్చేది. అయితే మండల పునర్విభజనలో 12 గ్రామాలు తిరిగి వికారాబాద్ జిల్లాలో చేరటంతో.. ఈ సారి కేవలం పాలమూర్ అభ్యర్థుల ఫలితాల కోసం మండల ప్రజలు ఎదురు చూస్తున్నారు.

అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు

నారాయణపేట రూరల్: అమ్మాయిలను వేధిస్తే కఠిన శిక్షలు తప్పవని ఏఎస్ఐ శ్రీదేవి అన్నారు. షీటీమ్స్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షలకు హాజరైన అభ్యర్థులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు అత్యవసర సమయంలో తమ రక్షణకు షీ టీమ్స్ ఉంటాయనే విషయంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పని ప్రదేశాల్లో మహిళలు, బాలికలతో ఎవరైన ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే 100, మహిళా హెల్ప్ లైన్ నంబర్ 8712670398కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలను అరికట్టడానికి సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలని, అమ్మాయిలకు గుడ్, బ్యాడ్ టచ్ గురించి



అవగాహన కల్పిస్తున్న షీటీమ్

తెలిసి ఉండాలన్నారు. అమ్మాయిలతో పాటు మగపిల్లల్లోను మార్పు రావాలన్నారు. కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బాలరాజు, నమీనా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యకేంద్రంలో పండ్ల పంపిణీ

అడ్డాకుల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మూసాపేట మండలం జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు పండ్లను పంపిణీ చేశారు. అదేవిధంగా రెడ్‌క్రాస్ సొసైటీ అనాథాశ్రమంలో పిల్లలకు పండ్లను పంపిణీ చేశారు. అదేవిధంగా మాజీ మంత్రి హరీష్ రావు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్, పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ్మా, కొండయ్య, చంద్రశేఖర్, శ్రీనివాసులు, శివరాములు, రవీందర్‌గౌడ్, నర్సిములుగౌడ్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బాలానగర్: జడ్చర్ల నియోజవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ పులమోని నర్సిములు తండ్రి జంగయ్య(75) ఆదివారం మృతిచెందారు. విషయం తెలిసిన బీజేపీ జాతీయ ఉపాధ్యాక్షురాలు డీకే అరుణ సోమవారం సూరారం గ్రామానికి వచ్చి జంగయ్య మృతదేహం వద్ద నివాళి అర్పించారు. బాధితకుటుంబాన్ని పరామర్శించారు. ఆమె వెంట రాష్ట్ర నాయకురాలు పద్మజా రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు శ్రీశైలం, రామకృష్ణ తదితరులు ఉన్నారు.


పెండింగ్ పనులను పూర్తిచేయాలి



హన్వాడ: మండల ప్రత్యేకాధికారి నర్సిములు సోమవారం పలు పాఠశాలల్ని ఆకస్మికంగా సందర్శించారు. టంకర, కొత్తపేట, ఏనెమీదితండా, సల్లోనిపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను ఈ సందర్భంగా పర్యవేక్షించారు. పాఠశాలల ప్రారంభం నాటికి పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యశోద, ఎంఈఓ రాజునాయక్, ఏపీఎం సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామ స్టేజీ సమీపంలో గల శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధ్యాన మందిరంలో ఏర్పాటు చేయనున్న అలంకార శివుడి విగ్రహ ప్రతిష్ఠాపన కోసం వనపర్తి పట్టణ కేంద్రానికి చెందిన సీఎస్ఆర్ ఫిల్లింగ్ స్టేషన్ అధినేత దాడి చంద్రశేఖర్‌రెడ్డి, వనజ దంపతులు తమ సహాయంగా రూ.81వేలు విరాళంగా అందజేశారు. దాతలను ఆలయ నిర్వహకులు శాలువాలతో సత్కరించారు. ఆలయంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు దాతలు ముందుకు రావాలని నిర్వాహకులు కోరారు.



కష్టపడి చదివి మంచి పేరు తేవాలి



విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విద్యార్థులు కష్టపడి చదివి జిల్లాకు మంచి పేరు తేవాలని మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం రెడ్‌క్రాస్ అనాథ శరణాలయంలోని విద్యార్థులకు పండ్లు, బ్యాగులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, ఎంపీపీలు బాలరాజు, సుధాశ్రీ, పట్టణ అధ్యక్షుడు శివరాజ్, ఆయా మండలాల అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, అధ్యక్షులు కరుణాకర్ గౌడ్, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..

కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో... ఇటీవల మృతి చెందిన హన్వాడ మండలం కొత్తతండాకు చెందిన విస్లావత్ సామ్య కుటుంబ సభ్యులకు పార్టీ రూ. 2లక్షల చెక్కు అందజేశారు.

ముగిసిన హ్యాండ్‌బాల్ శిక్షణశిబిరం



శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎండి.జియావుద్దీన్ మాట్లాడుతూ జిల్లా యువజన, క్రీడల శాఖ, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మే 1వ తేదీ నుంచి 31 వరకు వేసవి హ్యాండ్‌బాల్ శిక్షణ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. నెలరోజులపాటు శిబిరంలో పాల్గొన్న వారికి మెరుగైన శిక్షణ అందజేసినట్లు తెలిపారు. శిక్షణ శిబిరం విజయవంతం కోసం కృషి చేసిన కోచ్‌లు, అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శిక్షణ శిబిరంలో పాల్గొన్న వారికి క్రీడాదుస్తులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ అధ్యక్షుడు రజనీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బాల్‌రాజు, కార్యనిర్వాహక కార్యదర్శి అహ్మద్ హుస్సేన్, కోచ్‌లు ప్రదీప్‌కుమార్, నర్సింహ పాల్గొన్నారు.

కరాటేలో చిన్నారుల ప్రతిభ అభినందనీయం

మహబూబ్‌నగర్ క్రీడలు: కరాటేలో చిన్నారులు ప్రతిభ కనబరిచి బ్లాక్‌బెల్టులు సాధించడం అభినందనీయమని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన ఆర్‌కే కరాటే స్పోర్ట్స్ అకాడమీ ఫౌండర్ కె.రవికుమార్ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ పొందిన హర్షశ్రీ, సౌమ్య, నవ్య, అగస్త్య, సాయి, అచ్యుత్, రాహుల్‌లు బ్లాక్ బెల్టులు సాధించారు. సోమవారం డీకే అరుణ విద్యార్థులను సన్మానం చేసి బ్లాక్‌బెల్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతోపాటు ఇలాంటి ఆత్మరక్షణ కరాటే మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యం సాధించడం గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



బ్లాక్‌బెల్టులు పొందిన విద్యార్థులతో డీకే అరుణ

121 మందికి వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్యులు

భూత్పూర్: మండలంలోని తాటికొండలో సోమవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. జిల్లా వైద్యాధికారి డా. కృష్ణ , క్షయ నివారణ అధికారి మహ్మద్ రఫిఖ్ ఆదేశాల మేరకు వైద్యాధికారులు డా. అబ్దుల్ రబ్, డా. సంధ్య కిరణ్మయి 121 మందికి క్షయ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 15 రోజులకు మించి దగ్గు, బరువు తగ్గడం, రాత్రి వేళల్లో చెమటలు రావడం, వంటి లక్షణాలు ఉంటే వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించి వైద్యం చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఆయూబ్, వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మురుగుతో ఇబ్బందులు



కాలువలో నిలిచిన మురుగు

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్ గ్రామంలో గ్రామ పంచాయతీ వెనుక ఉన్న పెద్ద కాల్వలో ఎప్పుడు మురుగు నీరు నిలిచి ఉండడం వల్ల స్థానికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గ్రామం చివరలో ఉండే కుంట నుంచి వచ్చే నీళ్లు ఇళ్ల మధ్యన ఉన్న ఈ కాలువలో వెళ్తున్నాయి. అయితే ఇక్కడ పెద్ద కాల్వలో ఇళ్ల నుంచి వెలువడే మురుగు నీళ్లు వచ్చి నిలుస్తున్నాయి. దీనివల్ల వేసవికాలంలో కాలువ పరిసరాల్లోని ఇళ్లల్లోకి దుర్వాసన వెదజల్లుతోంది. అదేవిధంగా కుక్కలు, పందులు అందులో చేరడంతో పరిసరాలు పూర్తి అపరిశుభ్రంగా మారుతున్నాయి. వర్షాలు కురిస్తే కాల్వ పరిసరాల్లో పరిస్థితులు పూర్తి అధ్వానంగా మారుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో కాల్వలో నిలిచే నీళ్ల మూలంగా చిన్నారులకు ప్రమాదం పొంచి ఉంది. కాలువలో మురుగు నీళ్లు నిలువ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా

కొత్తకోట రూరల్: బండల లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన కొత్తకోట మండలంలోని మిరాసిపల్లి ఎన్‌హెచ్44పై చోటు చేసుకుంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కర్నూల్ వైపు నుంచి లారీ బండల లోడ్‌తో హైదరాబాద్‌కు వెళ్తుండగా మిరాసిపల్లి స్టేజీ సమీపంలోకి రాగానే లారీలో సాంకేతిక లోపం కారణంగా అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో బండలు రోడ్డుకు అడ్డంగా పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, హైవే సిబ్బంది ఎంతో శ్రమించి బండలను, లారీని పక్కకు తీసి ట్రాఫిక్ క్రమద్దీకరించారు. డ్రైవర్ సంతోష్‌కు స్వల్ప గాయాలు కావడంతో అంబులెన్స్‌లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.



బోల్తా పడిన బండల లారీ

విద్యార్థులకు సైక్లింగ్ పోటీలు

మక్తల్: సైకిల్ దినోత్సవం సందర్భంగా పట్టణంలో విద్యార్థులకు సైక్లింగ్ పోటీలను సోమవారం నిర్వహించారు. మినీస్టేడియం నుంచి పురవీధుల గుండా 30 మంది బాలబాలికలు ఇందులో పాల్గొన్నారు. పోటీలను నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సైక్లింగ్ చేయడంతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని పీఈటీలు అంబ్రేస్, రూప తెలిపారు.



ప్రయాణికులకు సరిపడా బస్సులు నడపండి

నారాయణపేట రూరల్: మహాలక్ష్మి పథకం అమలు తర్వాత ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగిందని, అవసరానికి సరిపడేవిధంగా ఆర్టీసీ బస్సులను నడిపించాలని పలువురు కోరారు. సోమవారం నిర్వహించిన దయల్ యువర్ డీఎం కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 14 ఫిర్యాదులు వచ్చాయి. డిపో మేనేజర్ లక్ష్మీసుధ వారి సమస్యలను తెలుసుకున్నారు. ఏడీసీ ఆంజనేయులు వాటిని నమోదు చేసుకున్నారు. ముఖ్యంగా కోస్గి – మహబూబ్‌నగర్, నారాయణపేట – యానగుంది, కోటకొండ – భూనేడ్, మక్తల్ – మహబూబ్‌నగర్ రూట్లో బస్సు ట్రిప్పుల సంఖ్య పెంచాలని కోరారు. భూనేడ్, గత్ప గ్రామాల నైట్ సర్వీసులను పునరుద్ధరించాలని, పులిమామిడి మీదుగా హైదరాబాద్, యాంకి నుంచి ఆత్మకూర్, కోస్గి నుంచి ఈర్లపల్లి మీదుగా దౌల్తాబాద్ బస్సు నడిపించాలని కోరారు. అదేవిధంగా కోటకొండ, బైరంకొండ, బోయిన్‌పల్లి రూట్లలో పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సమయానికి సరిపడ స్కూల్ బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు.